క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం

ఉయ్యూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 నుంచి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తారని మండల ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

180 మందికి ఉచిత వైద్య సేవలు



పెనమలూరు: చోడవరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 180 మందికి వైద్య సేవలు అందించారు. లయన్, ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ రావి సురేష్ బాబు ఆధ్వర్యాన గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి కాకర్ల వెంకటరత్నం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. దృష్టి లోపాలు ఉన్నవారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. గ్రామంలో మొక్కలు నాటి పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ జాస్తి శ్రీనివాసరావు, కోమటి కిరణ్‌కుమార్, దొండపాటి సురేష్, రావి ప్రవీణ్, కోలవెన్ను మురళి, దేవరపల్లి వెంకట్రావు కలతోటి రామకృష్ణ, కలపాల శ్రీకాంత్,గ్రామస్తులు పాల్గొన్నారు.

అత్తింటివారి వేధింపులపై కేసు

పెనమలూరు: అత్తింటివారిపై ఆదివారం వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకికి చెందిన బాడిస సరోజిని మూడేళ్ల క్రితం కొత్తూరు తాడేపల్లికి చెందిన సతీష్‌కుమార్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భర్త ప్రైవేట్ ఉద్యోగి. అదనపు కట్నం కావాలని భర్తతో పాటు అత్త పద్మావతి, మామ పానకాలరావు, ఆడపడుచు నిమ్మకూరు ధనలక్ష్మి వేధిస్తున్నారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..

పెనమలూరు: వరకట్న వేధింపులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. యనమలకుదురు భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన కన్నా నాగజ్యోతి రెండున్నర ఏళ్ల క్రితం నాగాయలంకకు చెందిన కృష్ణారావును వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. పిల్లలు జన్మించిన తర్వాత భర్త కృష్ణారావు, అత్త గంగాభవాని, మామ భిక్షం, మరిది నాగరాజు అదనం కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళపై దౌర్జన్యం

పెనమలూరు: తాడిగడపలో ఇంటి సరిహద్దు విషయంలో మహిళపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి సమీపంలోని కాల్వ కట్టపై బి.జ్యోతికుమారి కుటుంబ సభ్యులతో ఉంటోంది. ఆమె ఇంటి సరిహద్దు గోడ నిర్మాణం చేస్తుండగా పక్కింట్లో ఉంటున్న గంటికంటి శ్రీను అభ్యంతరం తెలుపుతూ జ్యోతికుమారితో అసభ్యంగా ప్రవర్తించి దౌర్జన్యానికి దిగాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో రిక్షా కార్మికుడికి గాయాలు

పెనమలూరు: గంగూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రిక్షాపుల్లర్‌కు గాయాలుకావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోరంకి పాత పోలీస్‌స్టేషన్ ప్రాంతానికి చెందిన రిక్షాపుల్లర్ సంతోష్‌కుమార్ పెనమలూరు నుంచి గంగూరుకు రిక్షాలో సిమెంట్ సామగ్రి తరలిస్తుండగా గంగూరు సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన అంబులెన్స్ ఢీ కొట్టింది. ఘటనలో గాయపడిన సంతోష్‌కుమార్‌ను విజయవాడలో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

పెనమలూరు: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఒక వ్యక్తి గాయపడటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మద్దూరుకు చెందిన నడకుదుటి పండు.. చేపల వ్యాపారి. అతను శనివారం చేపల వ్యాపారానికి బైక్‌పై మద్దూరు నుంచి విజయవాడకు కరకట్టపై బయలుదేరాడు. అతను యనమలకుదురు పరిధి చింతల కట్ట వద్దకు రాగా వెనక నుంచి అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఘటనలో పండు రోడ్డుపై పడిపోయి గాయపడ్డాడు. అతన్ని పటమటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పండు బాబాయి సత్యనారాయణ మూర్తి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పన్ను వసూళ్లపై దృష్టి

- ఉన్నతాధికారుల ఆదేశంతో ఇంటి పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు
- బకాయి రూ.3 కోట్లు
- ఇప్పటివరకు వసూలు చేసింది రూ.84 లక్షలు
- వసూలు చేయాల్సింది రూ.2.16 కోట్లు



గంగూరు సచివాలయం

పెనమలూరు: మండలంలో పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2022–23కు సంబంధించి ఇంటి పన్ను వసూళ్లలో అధికారులు వేగం పెంచారు. గతంలో నూరు శాతం వసూళ్లు సాధించకపోవడంతో పెండింగ్ పెరిగిపోయింది. దీంతో పంచాయతీలకు నిధులు తగ్గాయి. పన్ను వసూళ్లపై ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు సమీక్షించారు. పన్ను వసూళ్లలో వేగం పెంచి పంచాయతీలకు నిధులు సమకూర్చుకోవాలని ఆదేశించారు.

పెనమలూరు మండలంలో ఆరు గ్రామాలు ఉన్నాయి. అయితే 2022 మార్చి నాటికి గ్రామ పంచాయతీలకు పన్నుల బకాయి దాదాపు రూ 84 లక్షల వరకు ఉంది. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు వసూలు చేయాల్సిన ఇంటి పన్నులు రూ 2,13,73,021 ఉంది. పాత బకాయితో కలిపి మొత్తం వసూలు చేయాల్సిన పన్నులు రూ 3,01,28,226 ఉంది. ఇప్పటివరకు పాతబకాయిలో రూ 27,41,358, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన రూ 56,54,157 కలిపి మొత్తం రూ 83,95,515 పన్నులు మాత్రమే వసూళ్లు చేశారు.

గ్రామపంచాయతీ ఆర్థిక బలోపేతానికి చర్యలు

గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల బకాయిలు బాగా పేరుకు పోవడంతో వాటిని ఆర్థికంగా పటిష్టం చేయడానికి పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామాల్లో పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గ్రామాల వారీగా పన్నుల బకాయి వివరాలు ఇలా ఉన్నాయి. గోసాల పంచాయతీలో రూ 17,45,864, పెనమలూరులో రూ 1,14 కోట్లు, చోడవరంలో 9,34,659, పెద పులిపాకలో రూ 28,93,165, గంగూరులో రూ 31,68,298, వణుకూరులో రూ 15,52,092 చొప్పున మొత్తం బకాయి రూ 2.17 కోట్లు ఉంది. పన్నులు సకాలంలో వసూళ్లు చేస్తేనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, పాలన వేగంగా ఉంటుందని అధికారులు దృష్టి సారించారు.

నెలలో వంద శాతం పూర్తి చేయాలి

గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు నెలలో వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించాం. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో పన్నుల వసూళ్లకు కార్యదర్శులు ప్రణాళిక రూపొందించాలి. పన్నుల వసూళ్లు చేసి వేగంగా అభివృద్ధి చేయాలి. సిబ్బంది పన్ను బకాయిలపై దృష్టి పెట్టాలి.

– కోరా శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ, పెనమలూరు

ప్రతిభావంతులను ప్రోత్సహించడానికే 'మానవత'



తల్లిదండ్రులను సత్కరిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన గ్రామీణ ప్రాంత యువతను పోప్రోత్సహించడంలో మానవత ఎల్లప్పుడూ ముందు ఉంటుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో ఆదివారం మానవత ప్రతిభా పురస్కారం కార్యక్రమం జరిగింది. హనుమాన్‌జంక్షన్‌లోని కేఎస్‌ఆర్ ఫుట్‌వేర్ అధినేత కొల్లిశెట్టి నారాయణరావు కుమారుడు నాగేంద్రబాబుకు ఈ నెల ప్రతిభా పురస్కారాన్ని అందించారు. ప్రతిభా పురస్కారం కింద రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు మారుబోయిన చేతుల మీదగా నాగేంద్ర బాబుకు అంజేశారు. అనంతరం తల్లిదండ్రులు నారాయణరావు, మంగతాయారును మానవత సభ్యులు సత్కరించారు. హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా సుబ్బారావు, బెజవాడ శ్రీరామ్మూర్తి, సీనియర్ సభ్యులు వడ్డీ రాజేశ్వరరావు, గూడపాటి జయరామచంద్రరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, సత్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ అవగాహన సభలకు స్పందన



వేమండలో జంగిల్ క్లియర్ చేస్తున్న కూలీలు

ఉంగుటూరు: జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న అవగాహన సదస్సులకు విశేష స్పందన లభిస్తోంది. గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అత్యధిక సంఖ్యలో లబ్ధిదారులు ముందుకు వస్తున్నారు. గ్రామ సభల్లో లబ్ధిదారులు చెప్పిన అంశాలను పరిశీలించిన అధికారులు జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన చర్యలు వేగవంతం చేశారు. వేమండలో 43ప్లాట్లు ఉన్న లేఅవుట్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. కొయ్యగూరపాడులో రహదారి సక్రమంగా లేక గృహనిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయని గుర్తించిన ప్రజాప్రతినిధులు, అధికారులు మండల పరిషత్ నిధులతో రోడ్డు పనులను ఆదివారం చేపట్టారు. ఎంపీడీవో శేషగిరిరావు పనులను పర్యవేక్షించారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న అంబేద్కర్ వర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అజంతకుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోగలరని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అజంతకుమార్ అన్నారు. స్థానిక మాచవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్, పరీక్షల ప్రిపరేషన్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రాబోయే పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించగలరన్నారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ దాస్ లాంగ్వేజీ సబ్జెక్టులలో మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని వృద్ధుల కోసం తాము ప్రత్యేకంగా ప్రతి వారం ఉచితంగా హోమియో, ఆయుర్వేద, అల్లోపతి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని వృద్ధులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, ట్రస్టీ తట్టి అర్జునరావు పాల్గొన్నారు.

పాతశివాలయంలో సూర్యోపాసన



సూర్యోపాసన చేస్తున్న రుత్వికులు

వనటౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం) లో సూర్యోపాసన కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాఘమాసం ఆదివారం సూర్యుడికి ప్రీతికరం కావడంతో పాతశివాలయంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సూర్యుని చక్రం వేసి ఆదిత్యునికి పూజలు చేశారు. సూర్యనమస్కారాలను ఆచరిస్తూ పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కరోనా వంటి విపత్తులను పారదోలాలని కోరుతూ సూర్యుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షించారు.

శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో..

శ్రీకృష్ణ ప్రార్థనా మందిరంలో కొలువై ఉన్న సూర్యభగవానుడికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

ముస్తాబాదలో ఘనంగా దైవవాక్కు



భక్తులకు సందేశమిస్తున్న రెవరెండ్ ఫాదర్‌లు విజయరాజు, ఆంథోని బాలజోసెఫ్

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో ఆదివారం దైవవాక్కు పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఆర్సీఎం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఎం.ఆంతోని బాలజోసెఫ్ ఆధ్వర్యంలో జ్యోతిర్మయి(దైవవాక్కు) ఆదివారం బైబిల్ గ్రంథాన్ని పూలతో అలంకరించారు. భక్తులు బైబిల్ గ్రంథాలతో ప్రదక్షిణగా ఊరేగించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న రెవరెండ్ ఫాదర్ విజయరాజు భక్తులకు జ్యోతిర్మయి ఆదివారం విశిష్టత వివరించి, బైబిల్ పరిచర్య నిర్వహించారు. క్రీస్తు చూపిన మార్గం అనుసరించాలన్నారు. విచారణ భక్తులు, పెద్దలు పాల్గొన్నారు.

దివ్యబాలఏసు మహోత్సవాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక జ్యోతినగర్‌లోని ఆర్సీఎం చర్చిలో దివ్యబాలఏసు మహోత్సవాలు ఎనిమిదోరోజు ఘనంగా జరిగాయి. ఆదివారం కావటంతో అధిక సంఖ్యలో విశ్వాసులు దేవాలయానికి విచ్చేసి బాలఏసు ప్రార్థనలు చేశారు. విజయవాడ లబ్బీపేట విచారణకర్త ఫాథర్ ఎం.గాబ్రియేలు ఆధ్వర్యాన బాలఏసుకు ఘనంగా దివ్య పూజ సమర్పించారు. ఎవరికీ కీడు తలపెట్టని వినయవంతులైన ప్రజలను ఏసుక్రీస్తు ఆశీర్వదిస్తారని ఫాదర్ గాబ్రియేలు దైవ సందేశంలో పేర్కొన్నారు. జ్యోతినగర్ విచారణకర్త చేబ్రోలు జోసఫ్ తంబి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జేఎంజే, జ్యోతి హస్పటల్ సిస్టర్స్ బాలఏసు గీతాలను ఆలపించగా, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రక్తదానం చేసి ప్రాణదాతలుకండి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఉయ్యూరు: రక్తదాన చేసి ప్రాణదాతలు కావాలని లయన్స్‌క్లబ్ విజయవాడ రూరల్ ప్రతినిధి లింగం శివశంకర్ అన్నారు. మండలంలోని కలవపాముల జ్యోతి పాలిటెక్నిక్ కాలేజీలో ఆదివారం లయన్స్ క్లబ్, క్యాపిటల్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందించారు. పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు తాతినేని శ్రీహరిరావు, గద్దె శేషగిరావు, కాలేజీ కార్యదర్శి ఎస్వీ రమణ, ప్రిన్సిపాల్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

నేడు, రేపు గ్రామాల్లో ఔట్‌రీచ్ ప్రోగ్రామ్స్

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని సోమ, మంగళవారాల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తారని ఎంపీడీఓ బి.భార్గవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం, వారికి పథకాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అర్హులు పథకాలను పొందడానికి దరఖాస్తు చేసుకొనే విధానం తెలపడం కార్యక్రమంలో ముఖ్యమైన అంశమని ఎంపీడీఓ తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యాన 50 గృహాలకు సంబంధిత వలంటీర్‌తో పాటు సచివాలయ సిబ్బంది వెళ్లి కార్యక్రమాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీల ప్రతినిధులు ఔట్‌రీచ్ కార్యక్రమాల్లో తప్పకుండా పాల్గొనాలని తెలిపారు.

స్వచ్ఛ ఉయ్యూరుకు కృషి

ఉయ్యూరు: స్వచ్ఛ ఉయ్యూరు లక్ష్యంగా కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. స్వచ్ఛ ఉయ్యూరులో భాగంగా చెత్త సేకరించడానికి ప్రత్యేకంగా తయారుచేసిన తోపుడు డస్ట్‌బిన్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు విచక్షణారహితంగా చెత్త, వ్యర్థాలను రహదారులు, ప్రధాన కూడళ్లలో వేయొద్దని, డస్ట్‌బిన్‌లను వినియోగించాలని సూచించారు.

ఉంగుటూరులో 234 మందికి జగనన్న చేదోడు

ఉంగుటూరు: మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో జగనన్న చేదోడు పథకం ద్వారా 234 మందికి లబ్ధి చేకూరనున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 27గ్రామాల నుంచి జగనన్న చేదోడు పథకానికి 234 మంది దరఖాస్తు చేయగా 147మందికి మంజూరయ్యాయని పేర్కొన్నారు. వారి బ్యాంకు ఖాతాల్లో సోమవారం నగదు జమవుతుందని చెప్పారు. వివిధ సాంకేతిక కారణలతో అర్హత పత్రాలు సమర్పించని 87 మందికి ఫిబ్రవరి 11లోగా చేదోడు నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు వివరించారు.

25 వేల మందికి అన్నసమారాధన



పెనమలూరులో అన్నసమారాధనలో భక్తులు

పెనమలూరు: స్థానికంగా ఆదివారం భారీ ఎత్తున అయ్యప్ప అన్నసమారాధన నిర్వహించారు. గ్రామంలో 43 ఏళ్లుగా అన్నసమారాధనను అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు కలిసి నిర్వహిస్తున్నారు. దాదాపు 25 వేల మంది భక్తులు జిల్లా నలుమూలల నుంచి వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులు భజనలు చేశారు. అయ్యప్ప నామ స్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. నిర్వాహకులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడ యనమలకుదురుకు చెందిన హనుమాన్ నృత్య కళా నిలయానికి చెందిన శ్రీనాగ, షణ్ముఖప్రియ, ఇతిహ్యా, తేజశ్విని కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆదివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులు ఆసక్తికి వీక్షించారు. అనంతరం కళాకారులకు ఇంద్రకీలాదిర ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

స్వీయ పరీక్షలు చేయించుకోవాలి

గన్నవరం రూరల్: కుష్టు వ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని, స్వీయ పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి జె.సంధ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30 నుంచి మండలంలో అవగాహన ప్రచారాన్ని ఫిబ్రవరి 13వరకూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, పొడలు, చెవి తమ్మెలు మందంగా మారడం , బుడిపెలు ఉండటం లక్షణాలని, స్వీయ పరీక్షలు చేయించుకోవడానికి పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు.

వర్మీకంపోస్టు ఎరువు సిద్ధం

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 62వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద తయారు చేసిన వర్మీకంపోస్టు ఎరువు అమ్మకానికి సిద్ధంగా ఉందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు తెలిపారు. కేజీ ఎరువు రూ.10 చొప్పున విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారు 98669 96387లో సంప్రదించవచ్చని తెలిపారు. నర్సరీలు పెంచుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇంటి పెరట్లో పెంచుకునే పూలమొక్కలు, కూరగాయల మొక్కలకు వర్మీకంపోస్టు ఎరువు వాడుకోవచ్చని తెలిపారు.

విద్యార్థుల్లో సత్ప్రవర్తనే లక్ష్యం

పామర్రు: విద్యార్థుల్లో సత్ప్రవర్తన పెంపొందించేందుకు మానవత ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు పామర్రు మానవత రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక అరండల్ పేటలోని మానవత కార్యాలయం వద్ద సర్వ సభ్యసమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత ద్వారా ఎన్నో వినూత్న సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు సేవలను అందిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో పరివర్తన కల్గించేందుకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణా తరగతులను నిర్వహించి వారిలో మార్పు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో మానవత చైర్మన్ శీతాల ప్రసాద్, కార్యవర్గ ప్రతినిధులు కొల్లా శ్రీనివాసరావు, ఎస్.త్రివిక్రమరావు, వైఎస్ఎన్ ప్రసాద్, రెడ్రౌతు నరసింహారావు, ఏ సోమశేఖరరావు, టి.వేణు ప్రసాద్, జి.రంగారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంతిమ సంస్కారం



గన్నవరం రూరల్: అనాథ వృద్ధురాలి అంతిమ సంస్కారానికి తెంపల్లి పంచాయతీ సర్పంచ్ కొలుసు శిరీష, వైఎస్సార్ సీపీ నాయకుడు కొలుసు కిరణ్‌కుమార్ సాయం చేశారు. గ్రామానికి చెందిన నడ్డి వెంకమ్మ(81) యాచకురాలు. ఏడాది క్రితం గ్రామంలోకి వచ్చిన ఆమెకు ఎవరూ లేరు. గ్రామంలో ఒక చోట పట్టా కట్టుకుని రోడ్డు వెంట ఉంటోంది. ఆదివారం ఆమె మృతి చెందటంతో ఈ విషయాన్ని వలంటీరు కొలుసు అంకాలు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లాడు. ఎవరూ ముందుకు రాకపోవటంతో సర్పంచ్ అంతిమ సంస్కారాలకు నగదు చేయూతనిచ్చి, వెంకమ్మకు చివరి సంస్కారాలు నిర్వహించాలని సూచించారు. దీంతో పంచాయితీ బండిపైనే ఆ వృద్ధురాలి మృతదేహాన్ని తరలించి ఖననం చేశారు. వలంటీర్ చొరవను, సర్పంచ్ వితరణను గ్రామస్తులు అభినందించారు.